విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఐపీఎస్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్

దామగుండం ప్రజలకు బాసటగా నిలుస్తాం

నేవీ రాడార్‌కు 30 ఎకరాలు కేటాయించడం సరికాదు

12 లక్షల చెట్లు కనుమరుగయ్యే ప్రమాదం

విలేకరులతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

యాలాల, సెప్టెంబర్ 27 : దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ నెలకొల్పేందుకు 30 ఎకరాలను కేటాయించడం సరికాదని, దీనివల్ల 12 లక్షల చెట్లు కనుమరుగయ్యే ప్రమాదమున్నదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకుపచ్చ తెలంగాణ కోసం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి విస్తృతంగా మొక్కలను నాటగా, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెట్లను నరికివేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కండ్లు మూసుకొని అటవీ భూమిని నేవీకి అప్పగిస్తున్నారని, దామగుండం ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అటవీ ప్రాంత భూములను కేటాయించడానికి బదులుగా సీఎం రేవంత్‌రెడ్డి, వారి సోదరులకు చెందిన 5000 ఎకరాల్లో నుంచి కొంత భూమిని కేటాయిస్తే ప్రజలకు ఇబ్బందులు కలుగవని హితవు పలికారు. దామగుండం వృక్ష సంహారాన్ని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మూసీ నది పరీవాహక భూ నిర్వాసితుల పక్షాన బీఆర్ఎస్ నిలుస్తున్నదన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నదని, ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో కాంగ్రెస్ ప్రభుత్వం తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు శ్రీశైల్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్, తాండూరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ నరేందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ సలీం, తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, స్టేజీపై అధికారులతో కలిసి కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

కార్యకర్తలు లోపల.. అధికారులు బయట..

కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లా అధికారుల సమీక్షా సమావేశం

- వేదికపై ఎమ్మెల్యే పక్కనా కాంగ్రెస్ నాయకులే..
- స్టేజీ ఎదుట కూర్చున్న డివిజన్ స్థాయి అధికారులు
- స్థలం లేక బయట నిలబడిన పలువురు అధికారులు
- సమావేశం నిర్వహించిన ఎంపీడీవో తీరుపై విమర్శలు

పరిగి, సెప్టెంబర్ 27 : పరిగి మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో శుక్రవారం నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశం.. కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లా మారింది. సమావేశానికి అధికారులు తక్కువ, కాంగ్రెస్ శ్రేణులు అధికంగా హాజరుకావడం విడ్డూరం. వివరాల్లోకి వెళితే.. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మండల స్థాయిలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై నిర్వహించే సమీక్షకు అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో ఎంఎ కరీం నివేదికను అందించారు. దీంతో వివిధ శాఖల మండల, కొన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరయ్యారు. ఇక్కడివరకు అంతా బాగున్నా... సమావేశపు హాలులో వివిధ శాఖల అధికారుల కంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే కూర్చోవడంతో పలువురు అధికారులకు కూర్చోవడానికి సీట్లు లేక హాలు బయట, ఇతర గదుల్లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు వేదికపై ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో కరీం, తహసీల్దార్ ఆనంద్ రావు, ఎంఈవో గోపాల్‌లు కూర్చోగా, అంతకంటే రెట్టింపు సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు డివిజన్ స్థాయి అధికారులు సైతం స్టేజీ ఎదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నప్పటికీ సమీక్షా సమావేశానికి ఆహ్వానించిన ఎంపీడీవో వారిని స్టేజీపైకి పిలువకుండా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన స్టేజీ పంచుకోవడం విడ్డూరం. ఈ సమీక్షలో సంబంధిత శాఖల అధికారులు ఉండాల్సిందిపోయి కాంగ్రెస్ నాయకులతో హాలు నిండిపోవడంపై ఎంపీడీవో తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరైనట్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయడం గమనార్హం. తమను పిలువడం ఎందుకు, గంటల తరబడి బయట నిలబెట్టడం ఎందుకని పలువురు అధికారులు బాహాటంగానే విమర్శించడం కనిపించింది. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా సమావేశం నిర్వహించిన ఎంపీడీవోపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పరిగిలో సమావేశం ఉన్నది.. రుణమాఫీ కానివారు అక్కడికి రావాల్సిందిగా కాంగ్రెస్ నాయకులు సూచించడంతో పలువురు రైతులు సమావేశం హాలు దగ్గరకు వచ్చి తమకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారులు, బ్యాంకర్లతో మాట్లాడిన ఎమ్మెల్యే అందరికీ రుణమాఫీ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెప్పిన పని చేయండి అంటూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు హుకూం జారీ చేయడం కొసమెరుపు.

రూ.55 కోట్లు రుణమాఫీ..

– ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి

పరిగి మండలంలో రూ.55 కోట్లు రుణమాఫీ అయ్యిందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారని, త్వరలో వారికి మాఫీ అవుతుందన్నారు. బ్యాంకు అధికారుల తప్పుల వల్ల కొందరికీ రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే రెండు లక్షల రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ధరణి స్థానంలో త్వరలో భూమాత పోర్టల్ తీసుకొస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన ప్రొసీడింగ్‌లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

సమావేశపు గదిలో స్థలం లేక మరో గదిలో నిల్చున్న పంచాయతీరాజ్ ఏఈ చాణక్యరెడ్డి



సమావేశంలో అధికారుల కంటే అధికంగా కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

స్థలం లేక మరో గదిలో నిలబడి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఇబ్రహీంపూర్ పంచాయతీ కార్యదర్శి

నిలబడి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న మిట్టకోడూర్ ప్రత్యేకాధికారి



సీఎం నుంచి ఒప్పందపత్రాలను అందుకుంటున్న వయాట్రిస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు

చిన్నారులకు అల్పాహారం

కొడంగల్, సెప్టెంబర్ 27 : కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నాణ్యమైన పౌష్టిక అల్పాహారం అందించే కార్యక్రమానికి ఒప్పందం కుదిరింది. ప్రఖ్యాత వయాట్రిస్ ఫార్మా సంస్థ తమ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.6.4కోట్ల విరాళం ఇచ్చింది. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పైలట్ ప్రాజక్టు కింద కొడంగల్ నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లోని 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి సమక్షంలో ఈ మేరకు రెండు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వయాట్రిస్, సీఎస్ఆర్ విభాగం బాధ్యురాలు మిచేల్ డొమినికా, హెచ్‌కామ్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈవో కౌంతేయదాస్ పరస్పరంగా ఎంవోయూ మార్చుకున్నారు. సీఎస్ఆర్ వ్యవహారాలు పర్యవేక్షించే టీ–ఎస్ఐజీ విభాగం హెడ్ అర్చన, కొడంగల్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వమతాల సమానత్వం ధ్యానంతోనే సాధ్యం

హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్

మొక్క నాటి నీళ్లు పోస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్, బౌద్ధ మత ప్రతినిధులు

నందిగామ, సెప్టెంబర్ 27 : సర్వమతాల సమానత్వం ధ్యానంతోనే సాధ్యమౌతుందని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్ అన్నారు. శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్ జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య డిప్యూటీ సెక్రెటరీ జనరల్ వెన్ ఖేమాచార భిక్కు, బౌద్ధ సమాఖ్య శ్రీలంక అడిషనల్ సెక్రటరీ జనరల్ డామిండ పొరజ్‌లతో కమలేశ్‌పటేల్ కన్హా ఆవరణలో ప్రత్యేకమైన మహాబోధి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కమలేశ్‌పటేల్ మాట్లాడుతూ.. ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. ప్రపంచ శాంతి కోసం కులమతాలకు అతీతంగా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ దేశాల బౌద్ధ మత ప్రతినిధులు, హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు, అభ్యాసకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 27 : రైతులు సస్యరక్షణ పద్ధతులపే పాటిస్తూ పంటలు సాగు చేయాలని కూరగాయల పరిశోధనా స్థానం కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అన్నారు. అఖిల భారత దుంప పంటల సమన్వయ పరిశోధన పథకం(ఎస్సెస్పీ)లో భాగంగా శుక్రవారం షాబాద్ మండల పరిధి సర్దార్‌నగర్ గ్రామంలో దుంప పంటల సాగు, మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 25 మంది ఎస్సీ రైతులకు మొరం గడ్డ, చేదు దుంప, కందగడ్డలపై సాగు పద్ధతులు, సస్యరక్షణ, తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. రైతులకు చేతి పంపులు, మొరం తీగలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ శశాంక, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు



ఇబ్రహీంపట్నంరూరల్ : బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 27 : స్వరాష్ట్రం కోసం పదవులను సైతం త్యజించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రంగారెడ్డిజిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం బాపూజీ జయంతిని పురస్కరించుని కలెక్టర్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏవో సులీన్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కేశారాం, తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, బీసీ ప్రజా సంఘాల నాయకులు, సిబ్బంది ఉన్నారు.

వికారాబాద్ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమం, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూజజ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో బాపూజీ ముఖ్య పాత్ర పోషించారన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అండగా దీక్షను చేయడమే కాకుండా తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వివరించారు. తనకంటూ ఏమీ లేకుండా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సమావేశాలు ఏర్పాటు చేసుకొనుటకు తన ఆస్తులు మొత్తం కూడా దానం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. ఆయన తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలని ఆశించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సేవలను గుర్తించి అనేక కార్యక్రమాలను అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, వివిధ సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

* వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన చేపట్టిన విషయాల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రాజు, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

వికారాబాద్ : బాపూజీ జయంతి వేడుల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్



బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న జిల్లాపార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడుదాం

బీఆర్ఎస్ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులంతా కలిసికట్టుగా పోరాడుదామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడినప్పటికి నుంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని, హైడ్రా పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేసే పనిలో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులంతా ప్రజల పక్షాన ఉండి పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి సోమవారం, శుక్రవారాల్లో ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో తాను అందుబాటులో ఉంటానని, ఎవరికెలాంటి ఇబ్బందులున్నా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే కలిసికట్టుగా పరిష్కరించుకుందామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులున్నారు.

రైతుల బాధలు పట్టని కాంగ్రెస్ సర్కారు

- రైతుల ప్రభుత్వమంటూనే ఇబ్బందులకు గురిచేయడం సరికాదు
- ఉప్పరిగూడ సహకార సంఘం సమావేశంలో రైతుల ఆందోళన

సమావేశంలో రైతుల పక్షాన చైర్మన్, సీఈవోను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 27 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు గురిచేయబోమని గొప్పలు చెబుతూనే రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, రాష్ట్ర ఉత్తమ రైతు మొద్దు అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పరిగూడ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన రైతుల పక్షాన ఆందోళనకు దిగారు. ఓ పక్క ముఖ్యమంత్రి రైతులందరిరీ రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతాడు. కాని, ఇక్కడ ఏ రైతుకు కూడా సరిగ్గా రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కోసమని వ్యవసాయాధికారుల వద్దకు పోతే బ్యాంకుకు వెళ్లమంటారు. బ్యాంకుకు పోతే వ్యవసాయాధికారుల వద్దకు అంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఏ ఇబ్బంది లేకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. కాని, కాంగ్రెస్ సర్కారులో రైతులకు ఏ న్యాయం జరుగటంలేదు. రైతు బంధు, రైతు బీమా పథకాలకు ఎగనామం పెట్టారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోవడంలేదు. కల్తీ మందులు సరఫరా చేస్తున్నారు. రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు, నాయకుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటల పెంపకానికి

ప్రోత్సాహక పథకం

వికారాబాద్ ఏడీ స్వరూప

వికారాబాద్, సెప్టెంబర్ 27 : ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ కల్పించడం జరిగిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ ఏడీ స్వరూప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో రైతులందరూ అర్హులన్నారు. ఆయిల్ పామ్ సాగుకు, బిందు సేద్య పరికరాలకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎకరానికి రూ.11500 రాయితీ ఇవ్వబడుతుందన్నారు. మొక్కకు రూ.20 చొప్పున ఎకరానికి రూ.1,140 రైతు డీడీ తీసి రైతు వాటాగా చెల్లించాలన్నారు. ఎరువులు, అంతర పంటల కోసం మొదటి 4 సంవత్సరాల్లో ఎకరానికి రూ.4200 రాయితీ ప్రతి సంవత్సరం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందన్నారు. బిందు సేద్యానికి పరికరాల కోసం ఎకరానికి రూ.20వేల రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ రైతులకు 100 శాతం, ఇతర రైతులకు 90 శాతం బిందు సేద్యానికి రాయితీ ఉంటుందన్నారు. రైతుకు బోరు, విద్యుత్ కనెక్షన్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు మీ క్లస్టర్ ఉద్యాన అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో)లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మొక్కల కోసం రూ.1140 డీడీని 'DH & SO, VIKARABAD' పేరుపై తీయాలన్నారు. డ్రిప్పు పైపుల కోసం దరఖాస్తుతో పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, వన్ బి జిరాక్స్ (ఆర్‌వోఆర్), బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాస్‌ఫోటోలు(2), క్యాస్ట్ సర్టిఫికెట్(ఎస్సీ, ఎస్టీ), బాండ్ పేపర్ నోటరీ(రూ.20), ల్యాండ్ నక్ష సర్వే నంబర్, గ్రామపంచాయతీ తీర్మాన పత్రాలు అందజేయాలన్నారు.